# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పశ్చిమాసియా పరిణామాల నేపథ్యంలో దేశీయంగా పెట్రోలియం, ముడి చమురు, గ్యాస్, విద్యుత్, ఎరువుల రంగాలపై పడే ప్రభావాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్షించారు.
- ❖ దేశవ్యాప్తంగా 15 కోట్లకు పైగా గ్రామీణ గృహాలకు సురక్షితమైన తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించినట్లు కేంద్రమంత్రి సి.ఆర్. పాటిల్ తెలిపారు.
- ❖ దేశంలో పెట్రోల్, డీజిల్ వంటి నిత్యావసర ఇంధనాలకు ఎటువంటి కొరత లేదని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.
- ❖ అస్సోం, కేరళం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు రేపు సాయంత్రంతో గడువు ముగియనుంది.
- ❖ రైతులు పంటలు పండించడమే కాకుండా.. దేశానికి అవసరమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగారని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు.

================

పశ్చిమాసియా పరిణామాల నేపథ్యంలో దేశీయంగా పెట్రోలియం, ముడి చమురు, గ్యాస్, విద్యుత్, ఎరువుల రంగాలపై పడే ప్రభావాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్షించారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో దేశ వ్యాప్తంగా నిరంతర సరఫరా, స్థిరమైన రవాణా వ్యవస్థ, సమర్ధవంతమైన పంపిణీని కొనసాగింపుపై దృష్టి సారించారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, డాక్టర్ ఎస్. జైశంకర్, శివరాజ్ సింగ్ చౌహాన్, హర్దీప్ సింగ్ పూరి, పీయూష్ గోయల్, జె.పీ. నడ్డా, కె. రామ్మోహన్ నాయుడు, మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో చారిత్రాత్మక మైలురాయిని చేరుకున్నారు. ఎన్నికైన ప్రభుత్వానికి అత్యధిక కాలం నాయకత్వం వహించిన భారతీయ నేతగా ఆయన నిలిచారు. ఇప్పటివరకు 8 వేల 930 రోజుల పాటు సిక్కిం ముఖ్యమంత్రిగా పని చేసిన పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును నరేంద్ర మోదీ అధిగమించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా కలిపి మోదీ ఈ రోజుతో 8 వేల 931 రోజులు పూర్తి చేసుకుని.. పాలకుడిగా 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు. నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రయాణంలో పలు రికార్డులు నెలకొల్పారు. గుజరాత్‌లో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా.. అలాగే ముఖ్యమంత్రి అనుభవంతో ప్రధానమంత్రి పదవిలోకి వచ్చిన తొలి నాయకుడిగా గుర్తింపు పొందారు.

= = = = = = = = = = = = = = = =

భారత రాజకీయ చరిత్రలో అత్యధిక కాలం ఒక ప్రభుత్వానికి అధిపతిగా పని చేసిన నేతగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త మైలురాయిని అధిగమించడంపై కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జె పి నడ్డా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల వేదికగా వారు ప్రధానమంత్రికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ఘనత కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదని.. సేవ, కఠోర శ్రమ, అంకితభావానికి దక్కిన గౌరవమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. భారతదేశం పట్ల, దేశ ప్రజల పట్ల ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న అచంచలమైన అంకితభావమే నేడు ఆయనను ఈ స్థాయిలో నిలబెట్టాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం "వికసిత్ భారత్" లక్ష్యం వైపు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జే పీ నడ్డా తెలిపారు.

= = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల తలెత్తే ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ వేగవంతమైన, సమతుల్య చర్యలు తీసుకుంటోందని భారత పరిశ్రమల సమాఖ్య (CII) పేర్కొంది. సరఫరా గొలుసులో అంతరాయాలు కలగకుండా చూడటంతో పాటు.. ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు కలిసికట్టుగా పని చేస్తున్నాయని సీఐఐ వెల్లడించింది. సవాలుతో కూడిన ఈ సమయంలోనూ భారత్ పటిష్టమైన స్థితిలో ఉందని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = =

భారతీయ రైతులు కేవలం పంటలు పండించడమే కాకుండా.. దేశానికి అవసరమైన ఇంధనాన్ని, శక్తిని ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగారని కేంద్ర రహదారి, రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ ఆయిల్ సంస్థ సంయుక్తంగా హరియాణాలోని పానిపట్‌లో వరి గడ్డి ద్వారా ఇంధన ఉత్పత్తిని చేపట్టినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రస్తుతం ఏటా లక్ష లీటర్ల ఇథనాల్, 150 టన్నుల బయో-బిటుమెన్, 78 వేల టన్నుల విమాన ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా 15 కోట్లకు పైగా గ్రామీణ గృహాలకు సురక్షితమైన తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించినట్లు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ తెలిపారు. `జల్ మహోత్సవ్ 2026` ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన `సుజల్ గ్రామ సంవాద్`లో ఐదు రాష్ట్రాల ప్రతినిధులతో ఆయన దృశ్య మాధ్యమం పద్ధతిలో ఈరోజు

మాట్లాడారు. ఇంటివద్దకే తాగునీరు చేరడం వల్ల గ్రామీణ ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా... నీటి కోసం మైళ్ల దూరం నడిచే మహిళల కష్టాలు తప్పాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = =

అస్సోం, కేరళం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు రేపు సాయంత్రంతో గడువు ముగియనుంది. ఈ మూడు ప్రాంతాల్లోనూ వచ్చే నెల 9వ తేదీన ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. నామినేషన్ పత్రాల పరిశీలన మంగళవారం జరుగుతుంది. అభ్యర్థిత్వ ఉపసంహరణకు చివరి తేదీ మార్చి 26. తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఇక పశ్చిమ బెంగాల్‌లో రెండు విడతల్లో ఏప్రిల్ 23, 29వ తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

= = = = = = = = = = = = = = = =

రష్యా నుంచి ముడి చమురుతో బయల్దేరిన 'ఆక్వా టైటాన్' నౌక కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరుకుంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరగకుండా నియంత్రించేందుకు.. సముద్రంలో నిలిచిపోయిన రష్యా చమురు విక్రయాలకు అమెరికా తాత్కాలిక అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో ఈ నౌక భారత్‌కు చేరింది. మరోవైపు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం నుంచి LPGతో బయల్దేరిన 'పిక్సిస్ పయనీర్' కార్గో నౌక కూడా మంగళూరు నౌకాశ్రయానికి చేరుకుంది. ఇంతకుముందు.. గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు 'నందాదేవి' ఎల్పీజీ ట్యాంకర్ చేరుకుంది.

= = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ వంటి నిత్యావసర ఇంధనాలకు ఎటువంటి కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. చమురు శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గృహ అవసరాలకు వాడే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా యథావిధిగా సాగుతోందని, ఆందోళనతో ముందస్తు బుకింగ్‌లు  చేసుకోవడం తగ్గిందని ఆ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = =

విద్యుత్ కనీస అవసరమని, అది సామాన్య పౌరుడికి అందుబాటు ధరలోనే లభించాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన `భారత్ ఎలక్ట్రిసిటీ సమ్మిట్ 2026` ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సౌభాగ్య యోజన, పీఎం సూర్యఘర్ వంటి పథకాల ద్వారా దేశంలోని దూర ప్రాంతాలకు, సరిహద్దు ప్రాంతాలకూ విద్యుత్ చేరిందని తెలిపారు. ఇంధన రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతికత దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = =

భారతదేశం సొంత సాంకేతిక అవసరాలను తీర్చుకోవడమే కాకుండా.. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల అవసరాలను కూడా తీర్చే స్థాయికి చేరుకుంటుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. ఐఐటీ బాంబేలో జరిగిన "భారత్ ఇన్నోవేట్స్ డీప్-టెక్ ప్రి-సమ్మిట్ 2026" ముగింపు కార్యక్రమంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... రాబోయే దశాబ్ద కాలంలో ప్రపంచ డీప్-టెక్ (Deep-Tech) రంగానికి భారతదేశమే నాయకత్వం వహిస్తుందని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే బాధ్యత విద్యా సంస్థలు, పరిశ్రమలు, ఆర్థిక రంగం, యువతపై ఉందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=================

రానున్న 24 గంటల్లో ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా, కోస్తా ఆంధ్రప్రదేశ్, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా ప్రాంతాల్లో ఇదే తరహా వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

=================

=================